ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



24 గంటల కరెంట్ సరఫరాతో అధిక దిగుబడి

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం అందజేస్తున్న 24గంటల ఉచిత విద్యుత్‌తో వరి ధాన్యాన్ని అధిక దిగుబడి సాధిస్తున్నాం. గతంలో పాలించిన కాంగ్రెస్ నాయకులు కేవలం 6 నుంచి 9 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండడంతో అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. లోవోల్టేజీతోపాటు సక్రమంగా కరెంట్ సరఫరా అయ్యేది కాదు. దీంతో దిగుబడి సైతం చాలా తక్కువగా ఉండేది. కాంగ్రెస్‌కు అవకాశమిస్తే మళ్లీ పాత కథకు వస్తుంది. కాలిపోయిన మోటర్లు, పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మరొక్కసారి గ్రామాల్లో కానవస్తాయి. రేవంత్‌రెడ్డి వ్యవసాయంపై ఎలాంటి అనుభవం లేకున్నప్పటికీ అనవసరంగా మాట్లాడుతున్నాడు.

– మదన్‌రెడ్డి, రైతు, బాన్సువాడ, కంగ్టి

పాత విధానంతో భూములు కబ్జాలు అవుతాయి

ధరణి తీసివేసి పాత విధానాన్ని అమలు చేస్తే భూములు కబ్జాలకు గురవుతాయి. ధరణి పోర్టల్‌తోనే రైతులకు భరోసా ఏర్పడింది. పట్వారీ వ్యవస్థ పోయి, ఇప్పుడు మంచిగా ఉన్నది. భూముల కొనుగోలు, అమ్మకాలు, మ్యుటేషన్ లాంటివి తక్కువ టైంలనే జరిపోతున్నవి. సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారు.

– కమ్మల జయ ప్రకాశ్, రిటైర్డ్ రెవెన్యూ అధికారి, సంగారెడ్డి అర్బన్

10 హెచ్‌పీ మోటరుతో లాభం ఉండదు..

వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటరుతో ఎలాంటి ఉపయోగం ఉండదు. రైతులపై అదనపు భారం మోపేందుకే కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. వారికి వ్యవసాయం గురించి ఏ మాత్రం తెలియదు. 24 గంటల కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్‌కే మా మద్దతు. బీఆర్ఎస్‌తోనే రైతులు సంతోషంగా ఉంటారు.

– గాలయ్య, మక్త అట్టూరు గ్రామం, సంగారెడ్డి అర్బన్

కాంగ్రెసోళ్ల మాటలు నమ్మేది లేదు

గిప్పుడొచ్చి ఏదేదో గొప్పలు చెబుతూ ఓట్లు దండుకుందామని కాంగ్రెసోళ్లు మాయమాటలు చెబితే ఇక్కడ మేము నమ్మేది లేదు. కాంగ్రెస్‌కు ఓటేస్తే, కరెంటు పాత కష్టాలు మళ్లా వస్తయి. గిప్పుడు గా కరెంటు బాధలు పడే ఓపిక లేదు. గిప్పుడే కాలం కలిసిరాక ఈ ఏడాది వానకాలం పంటలు సాగానికి సగం పండినై. గిప్పుడు కాంగ్రెస్ అధికారమచ్చిందంటే మళ్లా దరిద్రం చుట్టుకున్నట్టే. 24 గంటల ఉచితంగా ఇస్తున్న కేసీఆర్ సారే మళ్లా సీఎం కావాలే.

– కుమ్మరి సాయిలు, రైతు, కడ్పల్, సిర్గాపూర్ మండలం

10 హెచ్‌పీ మోటర్లు మాకు గుదిబండలైతయి

మూడు గంటల కరెంట్ ఇస్తం, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటూ కాంగ్రెసోళ్లు రైతులను నట్టేటా ముంచడానికి మాట్లాడుతుర్రు. మాట్లాడెటోళ్లకు ఎవుసం తెలుసా? 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే లక్షరూపాలు కావాలి. ఆ మోటర్లకు సరిపడ కరెంట్ ఉండాలి కదా. గతం వచ్చినట్లు లోవోల్టేజీ ఉంటే 10హెచ్‌పీ మోటరు పక్కా కాలిపోతది. తెలంగాణ వచ్చినంక మెకానిక్‌ల మొఖం చూడనోళ్లం. ఇప్పుడు కాంగ్రెస్‌కు మద్దతిస్తే మేకానిక్‌ల వద్ద నాలుగైదు రోజులు పడిగాపుకాయాలా? ఎవ్వసం ఏటికి కొట్టుకుపోయినాసరేనా? 24 గంటల కరెంట్ వదులుకుని మూడుగంటల కరెంట్ కోసం కాంగ్రెస్‌కు ఓటేయాలా? సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఫుల్‌గా ఇస్తుండు. బీఆర్ఎస్‌తోనే మాబతుకులు బాగుంటయ్.

– బాజే కిష్టాగౌడ్, రైతు, మంభాపూర్, గుమ్మడిదల మండలం

ధరణి తీసేస్తే రైతులకు ఇబ్బందులు

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తే రెవెన్యూ అవినీతి పెరుగుతుంది. అటు ఆఫీసర్లను, ఇటు దళారులకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి వస్తుంది. రైతులు కోర్టు, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగి సమస్యల గుండంలో పడిపోతారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికలో ఓటు వేస్తే ధరణిని రద్దు చేసి, పాత రెవెన్యూ పట్టాన్ని తీసుకురావడం రైతులకు ఇబ్బందే. సీఎం కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– సంగన్న, రామోజిపల్లి గ్రామం, రాయికోడ్ మండలం

10 హెచ్‌పీ మోటర్లను రైతులందరూ పెట్టుకోలేరు

10 హెచ్‌పీ మోటర్లను సాగుకు రైతులందరూ పెట్టుకోలేరు. ఇప్పుడున్న బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తుండగా, కాంగ్రెస్ 4, 5 గంటల కరెంట్ ఇస్తామని చెప్పడం ఎందుకు. ఆ కరెంట్ కూడా ఏ టైంలో ఇస్తారో తెలియదు. ఇదంతా ఎందుకు. రైతులను ఎందుకు ఇబ్బందులు పెట్టడు.

– తుల్జా కుమార్, జిన్నారం మండలం

కాంగ్రెస్ పాలనలో కాళరాత్రులే

నాటి చీకటి రోజులు మళ్లీ రావద్దు

- కరెంటు లేని ఎవుసం చేయలేం
- రైతులను ఆగంజెయ్యాలని చూస్తున్నరు
- భూములను కాజేయాలని పన్నాగం పన్నుతున్నరు
- 'హస్తం' పార్టీపై రైతులు, ప్రజల మండిపాటు
- బీఆర్ఎస్ పాలనే బాగుందంటూ కితాబు
- కంటికిరెప్పలా కాపాడుకునే కేసీఆర్‌కే మద్దతు అంటూ స్పష్టం

కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడే

ఏనాడూ ప్రజల బాగోగుల గురించి ఆలోచించని కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడేనని, ఎట్టి పరిస్థితుల్లోనూ తాము పాత రోజులను కోరుకోవడం లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఇలానే కొనసాగాలని తాము కోరుకుంటున్నామని, తమ మంచిచెడ్డల గురించి ఆలోచించే గులాబీ పార్టీ వెంటే ఉంటామని రైతులు, ప్రజలు స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో అరిగోస పడ్డ రోజులు ఇంకా గుర్తున్నాయని, కరెంటు లేక, నీళ్లు లేక ఎవుసం సాగక పడ్డామని, ఇప్పుడు వచ్చి అబిచేస్తాం.. ఇదిచేస్తామని అసలు ఎవుసం గురించి తెల్సనోళ్లు మాట్లాడుతున్నారని, ఎవుసానికి మూడుగంటల కరెంటు ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు. ధరణిని తీసేస్తామంటే ఊరుకునేది లేదని, మళ్లీ భూముల పంచాయితీలు తేవద్దని తేగేసి చెబుతున్నారు. ఎన్నో పండ్లు పలిష్కారానికి నోచని సమస్యలు కూడా ధరణితో తీరాయని, ఇప్పుడిప్పుడూ భూముల కొట్లాటలు తగ్గుతున్నాయని, మళ్లీ దళారుల రాజ్యం రావద్దని అంటున్నారు. రైతులకు పంకావాల్సిన కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఆగంజేసే కాంగ్రెస్ వద్దని ముక్తకంఠంతో చెబుతున్నారు.

- నమస్తే తెలంగాణ సంగారెడ్డి నెట్‌వర్క్, నవంబర్ 26

3 గంటల కరెంట్‌తో మళ్లీ పాత రోజులే..

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు రైతులకు ఏమాత్రం ఉపయోగపడనివి. పనికిమాలిన మాటలు, హామీలు చెయ్యడం తప్ప కాంగ్రెస్ వాళ్లకు మంచి చేయడం చేతకాదు. 3 గంటల విద్యుత్ సరిపోతుందనడం రేవంత్‌రెడ్డికి వ్యవసాయం అంటేనే అవగాహన లేనట్లు తెలుస్తోంది. 10 హెచ్‌పీ మోటర్‌తో ఒక బావిలో గంటన్నరలోపు నీళ్లు ఖాళీ అయిపోయి ఇబ్బందులు పడల్సివస్తుంది. ఒకేసారి నీరు పారిస్తే మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. మళ్లీ పాత కథ మొదటికి వస్తుంది. 24గంటల విద్యుత్ సరఫరా కావలంటే కేసీఆర్ సర్కార్ మళ్లీ రావాలి. సీఎం కేసీఆర్‌కే మా రైతులందరి మద్దతు.

– పొట్టి చంద్రారెడ్డి, రైతు, మాంబాపూర్

రైతులకు మూడు గంటల కరెంట్ సరిపోదు

మూడు గంటల కరెంట్ పొలాలకు సరిపోతదో రేవంత్‌రెడ్డి రైతులకు సమాధానం చెప్పాలే. 24 గంటల కరెంట్ ఇవ్వడంతో, ఇప్పుడు రైతులు ఎదార్థంగా బతుకుతున్నరు. లేనిపోని మాటలు చెప్పి రైతులను నిండా ముంచేందుకే కొత్తకథ సురువుజేసినాడు. రేవంత్‌రెడ్డి మాటలు నమ్ముకుంటే రైతులు మల్లా రాత్రి కరెంట్ ఎక్కడవాయరో అంటూ పాము, తేలు కాట్లకు గురై అక్కడే సచ్చినాసస్తం. సాధ్యం కాని హామీలు ఇచ్చి రైతులను మోసం చెయ్యాలని మాస్తున్నారు. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ఫ్యూజ్‌లు ఉంటాయా? కాంగ్రెస్ నాయకులకు రైతుల గోసలు తెల్వది. ఆ పార్టీ నాయకుల మాటలు పట్టించుకోవద్దు.

– శివశంకర్ కురుమ, రాయికోడ్

ధరణి తీసేస్తే అవినీతి పెరుగుతుంది...

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, ధరణి తీసేస్తే రెవెన్యూలో అవినీతి విపరీతంగా పెరుగుతుంది. అటు ఆఫీసర్లకు, దళారులకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రైతులు మల్లా కోర్టులు, పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగి సమస్యల్లో పడిపోతారు. కాంగ్రెస్ ఇస్తున్న హామీలు కౌలు రైతులు పొట్ట కొట్టేలా ఉన్నాయి. కేసీఆర్ సార్ ప్రభుత్వం రూపొందించిన ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. కాంగ్రెసోళ్లు పాత పద్ధతిలో పట్వార్ వ్యవస్థను తీసుకురావాలని అనుకోవడం ప్రజలను ఇబ్బందుల్లో నెట్టడమే అవుతుంది. కాంగ్రెస్‌ను నమ్మకుండా బీఆర్ఎస్‌కే ఓటేస్తా.

– చంద్రయ్య, రైతు, శివ్వయ్యగూడెం

ధరణి మారిస్తే దళారీలు పెరుగుతరు

అవసరాలకు మా భూములను ఇంకొకరికి అమ్ముకోవాలంటే ధరణి పోర్టల్‌లో వేలిముద్రలు పెడితేనే పేరు మారుతుంది. ఈపద్ధతి ఓకే. పోయిన కాలంల ఉన్నట్టు, కాంగ్రెసోళ్లు అన్నట్లు ధరణిని మారిస్తే దళారిపెత్తనం వచ్చి, మామూలుజనానికి అన్యాయం జరుగుతది. భూములకు విలువపెరిగింది. భూమాత వంటి పద్ధతి వస్తే ఇగా పాతరోజులు వస్తయి. పాసుబుక్కుల కోసం చెప్పులరిగేలా పట్వారీల ఇంటిచుట్టూ తిరగాలి. సీఎం కేసీఆర్ పెట్టిన ధరణే ఉండాలి.

– ఎస్‌కే. షరీఫ్, వీరన్నగూడెం, రైతు, గుమ్మడిదల మండలం

ధరణి తీస్తే రైతులు ఆగమైతరు

రైతుల భూముల సురక్షితం కోసం సీఎం కేసీఆర్ భూ ప్రక్షాళన చేసి ధరణి తీసుకొస్తే, గిప్పుడు కాంగ్రెస్ అడ్డుపుల్ల వేసి, పాత పద్ధతి పట్వారీ వ్యవస్థ తెచ్చి న్యాయం చేస్తామంటూ రైతులకు మాయమాటలు చెప్పుతున్నరు. వాళ్ల మాటలు నమ్మి ఓటస్తే మాత్రం రైతులంతా ఆగమైతరు. అందరూ ఆలోచించి కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే అన్ని సంక్షేమ పథకాలు, సంక్షేమ ఫలాలు ఇంటికి నడిచొస్తయి.

– నందకుమార్ పాటిల్ రైతు వాసర్, సిర్గాపూర్ మండలం

ధరణితోనే ప్రజలకు మేలు..

గతంలో రైతులు ధరణి లేకపోవడం వలన ఎన్నో ఇబ్బందులు పడేవారు. వాళ్ల తల్లితండ్రుల నుంచి వచ్చే భూమిని సైతం వాళ్ల పేరుకు మార్చడానికే ఎన్నో పైరవీలు చేసేవారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణితో సులువుగా పట్టా చేసుకుంటున్నారు. ఎవరికి కూడా ఒక్క పైసా ఇవ్వకుండానే నేరుగా తమ భూమి హక్కులు పొందుతున్నారు. ధరణితో మనభూమిపై హక్కులు మనకే ఉండడం అనేది కేసీఆర్ ఆలోచన, దీంతో ప్రతి రైతు సంతోషంగా ఉన్నాడు.

– పి.నాగేందర్‌పాటిల్, మమ్మదాపూర్, రాయికోడ్ మండలం

10 హెచ్‌పీ మోటర్ అవసరమే లేదు

వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్ అవసరమే లేదు. ఎకరాకు 3 గంటల కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి మాట్లాడటం ఆయన అవివేకం. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్ధరాత్రి పొలానికి కరెంట్ వేసి వచ్చేటోళ్లం. నిద్ర ఉండేది కాదు. శాన తిప్పులు చూసినం. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత రైతులకు ఎంతో మేలు చేస్తుండ్రు. కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలు తప్పవు, కేసీఆర్ సారే రైతులకు మేలు చేస్తారు. మరోసారి ఆయనే సీఎం అయితడు. ఆయనకే ఓటేస్తం.

– నాజింపాటిల్, సీరూర్ గ్రామం, రాయికోడ్ మండలం

కాంగ్రెస్ మాటవింటే కరువు కాటకాలే...

మూడు గంటల కరెంట్‌తో పండిస్తున్న పంటలు పండకా సచ్చిపోయే కాలం వస్తది. పెట్టిన లాగీడిపైసలు కూడా రావు. 24 గంటల కరెంట్‌ను వదులుకుని 3 గంటల కరెంట్‌ను తీసుకోస్తే కంపినీల పనికి పోవల్సి వస్తది. దిక్కుమాలిన మాటలు మాట్లాడే కాంగ్రెస్‌సోళ్ల ఉచ్చులో పడితే రాష్ట్రంల ఎవ్వసం చేసే రైతు కనపింపడు. ఏది మంచిదో, ఏది చెడ్డతో మాకు తెలియదా. కేసీఆర్ చేస్తున్నది. చేసేది మాకు తెలుసు. కేసీఆరే మాకు పెద్దదిక్కు. బీఆర్ఎస్ అంటేనే మాకు అండదండ.

– యాంజాల సంజీవారెడ్డి, రైతు, అన్నారం, గుమ్మడిదల మండలం

ధరణి ఎత్తేస్తే విధ్వంసమే..

కాంగ్రెసోళ్లు ధరణి పోర్టల్ స్థానంలో భూమాతను తీసుకోస్తామంటున్నారు. అదె జరిగితే.. వ్యవసాయం, రైతన్న బతుకులు ధ్వంసమవుతాయి. డిజిటల్ వ్యవస్థ రద్దవుతుంది. ప్రభుత్వం వద్ద భూములు, రైతులు, పంటలు, విస్తీర్ణం, పంట విస్తీర్ణం దగుబడి వంటి వివరాలు ఉండవు. ఫలితంగా పంటలను అమ్ముకోవాలంటే కూడా దళారుల చుట్టూ తిరగాల్సి వస్తది. గెట్ల పంచాయితీలు మొదలవుతాయి. సీఎం కేసీఆర్ రైతుల శ్రేయస్సు కోసం తీసుకొచ్చిన ధరణితో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు

– సురేశ్ దేశ్‌ముఖ్, లిటిగేట్ హైకోర్టు న్యాయవాది, కారాముంగి గ్రామం, నాగల్‌గిద్ద మండలం

కాంగ్రెస్ వస్తే కరెంటు కష్టాలే..

రైతులు పంటల సాగు విషయంలో ఇబ్బందులు పడకూడదని సీఎం కేసీఆర్ సారు 24గంటల కరెంట్ ఇస్తుండే, కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంట్ ఇస్తామంటున్నారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ మొదటి రోజులే వస్తాయి, కరెంటు కోసం పడిగాపులు కాయాల్సి వస్తది. ఇప్పుడు రైతు చేసుకు పోయి ఎప్పుడంటే అప్పుడు మోటరు చాల్‌జేస్తుండు.

– కల్లయ్య స్వామి, రైతు, ఎల్గోయి, మనూరు మండలం

ధరణి పోతే అంతా ఆగమే..

రైతుల భూముల రికార్డులు భద్రంగా ఉన్నాయంటే అది కేసీఆర్ పున్యమే. అప్పుడు రికార్డులు అంతా ఆగమాగం ఐతుండే. రైతులు ఇబ్బందులు తీర్చేందుకే సీఎం కేసీఆర్ సారు ధరణి తీసుకొచ్చిండు. ధరణి తీసివేస్తే అంత ఆగమే. రైతులు అప్పుడు ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తది. ధరణి పద్ధతే బాగుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ సార్‌నే మళ్లీ గెలిపించుకుంటాం.

– గుండప్ప, రైతు, ఎల్గోయి, మనూరు మండలం

కాంగ్రెస్ అంటేనే ఝూటా పార్టీ..

కాంగ్రెస్ పార్టీ అంటేనే ఝూటా మాటలు చెప్పే పార్టీ. గతంలో తొమ్మిది గంటల పాటు కరెంటు ఇస్తామని ఐదారు గంటలు కూడా సరిగా ఇవ్వలేదు. ఎంతోమంది రైతుల చావులకు కారణమయ్యారు. ఇప్పుడు కౌలు రైతులు, పట్టాదారులకు రైతు బంధు పెట్టబడి సాయం చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టో ద్వారా ప్రజలను మోసగిస్తున్నారు. కాంగ్రెస్ ఎవరికీ ఇవ్వదు. కేవలం ఓట్ల కోసమే ఏమైనా మాట్లాడుతారు. సీఎం కేసీఆర్ రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నారు.

– నర్సింహారెడ్డి, రైతు, గురుజువాడ, కోహీర్ మండలం

రైతు బంధు పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసే కుట్ర..

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కౌలు రైతులకు రైతుబంధు ఇస్త, భూ యాజమానికి రైతు బంధు డబ్బులు ఇవ్వం అని ప్రకటించడం పెద్ద మోసం. రైతుబంధు పేరుతో ఓట్లు వేసుకొని మోసం చేసే కుట్ర కాంగ్రెస్ పార్టీ చేస్తుంది. ఎన్నికల్లో రైతులు ఆలోచన చేసి ఓట్లు వేయాలి. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలని చెప్పే మాటలతో, ప్రజలు ఆ పార్టీ నాయకుల మాటలపై ఆగ్రహంతో ఉన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలి.

– నరేశ్, విటునాయక్‌తండా, ముగుడంపల్లి మండలం

రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి..

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకిగా మాట్లాడుతుండ్రు. వ్యవసాయానికి 3గంటల కరెంట్ చాలన్న రేవంత్, ఇప్పుడు రైతుబంధు భూ యజమానికి లేదా కౌలు రైతుకి ఇద్దరలో ఒక్కరికే ఇస్తామని చెప్పడం వాళ్ల మేనిఫెస్టోని తుంగలో తొక్కినట్లే. రైతులను కాంగ్రెస్ పార్టీ నాయకులు మోసం చేస్తుండ్రు. కాంగ్రెస్ అంటేనే మోసాల పార్టీ. ఆ పార్టీని నమ్మితే ప్రజలను నట్టింట్లు ముంచుతారు. కాంగ్రెస్ పార్టీ హామీలను ప్రజలు నమ్మే యోచనలో లేరు. సీఎం కేసీఆర్‌పైనే ప్రజలు, రైతులు, అన్నివర్గాల ప్రజలు నమ్మకంతో ఉండ్రు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలి, ఎందుకు 10హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలి. సీఎం కేసీఆర్ రైతులకు ఎంతో మేలు చేస్తుండ్రు. రేవంత్‌కు, కాంగ్రెస్‌కు ప్రజలు మరో నాలుగు రోజుల్లో గట్టి గుణపాఠం చెప్పబోతుండ్రు.

– మల్లేపల్లి బుచ్చిరెడ్డి, పీఏసీఎస్ వైర్మన్ తెల్లాపూర్